బ్రాండెడ్ కంపెనీలకే బురడీ..!

◆ గతంలో పురుగుల మందులు

◆ ఇప్పుడు సిమెంటు కూడా నకిలీదే

◆ తనిఖీల్లో పట్టుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రముఖ బ్రాండెడ్ కార్పొరేట్ కంపెనీలకే బురడి కొట్టించేస్తున్నారు. అదే బ్రాండ్‌ల పేరుతో అదే రకమైన లేబుళ్లతో నకిలీలు మార్కెట్‌లోకి వచ్చేస్తున్నాయి. వీటిని కంపెనీవని కొనుగోలు చేసి వినియోగదారులు నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. గతంలో అనంతపురం నగరంలో బయర్ కంపెనీకి చెందిన పురుగుల మందులు నకిలీవి వచ్చాయి. వీటిని కంపెనీ వారే తమవి కాదని తేల్చి చెప్పారు. ఫోరోనిక్స్ ల్యాబ్‌లోనూ ఇవి లోటుపాట్లు గుర్తించారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు కూడా నకిలీలు మార్కెట్‌లోకి తీసుకొస్తున్న వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడే పరిస్థితులున్నాయి. మహారాష్ట్రకు చెందిన కొంత మంది నకిలీలను తయారు చేసి మార్కెట్‌లోకి తీసుకురావడమే కాకుండా చర్యల్లేకుండా రాజకీయపరమైన ఒత్తిళ్లు తీసుకొస్తుండటంతో ఏమీ చేయలేని పరిస్థితులు అధికారుల్లో నెలకొంది. తాజాగా ఇప్పుడు సిమెంట్ విషయంలోనూ ఇదే రకమైన మోసం జరిగింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఈ విషయం తేలింది. దీనిపై చర్యలు తీసుకుంటున్నట్టు ఆ శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు.

అల్ట్రాటెక్ పేరుతో నకిలీ సిమెంట్

సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం బూదిలి గ్రామం పరిధిలో కస్తూరి సిమెంట్స్ యూనిట్స్ పేరుతో సిమెంట్ విక్రయాలు జరుగుతున్నాయి. సదరు యూనిట్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం నాడు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పోర్టుల్యాండ్ పొజొలాన సిమెంట్ పేరుతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉంది. ఇక్కడ ప్లైయాస్, పిపిసిలు నిర్ణీత మోతాదు కంటే ఎక్కువ కలిపి అల్ట్రాటెక్ సిమెంట్ బ్రాండ్ మీద కర్నాటకలో విక్రయాలు చేస్తున్నట్టుగా విజిలెన్స్‌ఎన్‌పోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. ఇక్కడి నుంచి కర్నాటకకు బయలుదేరుతున్న కెఎ 53బి 3976 లారీలో 340 బస్తాల సిమెంట్, 88 ఖాళీ సంచలు పట్టుకున్నారు. ఈ సరుకు అల్ట్రాటెక్‌కు సంబంధించినది కాదని, నకిలీదని అల్ట్రాటెక్ సిమెంటు సిబ్బంది గుర్తించారు. దీంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశ్రమ నిర్వాహకులపై బిఎన్‌ఎస్ యాక్టు 2023, ట్రేడ్ మార్కు యాక్టు 1999 మేరకు క్రిమినల్ కేసులతోపాటు తూనికల కొలతల శాఖ నుంచి ఏడు కేసులు నమోదు చేశారు. ఈ రకంగా నకిలీ సిమెంటు తయారు చేసి కోట్లాది రూపాయల లావాదేవీలు చేసినట్టు వాణిజ్యపన్నుల శాఖ అధికారులు ఈ తనిఖల్లో గుర్తించారు. పూర్తి స్థాయి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వైబిపిటిఎ ప్రసాద్, డీఎస్పీ యం.నాగభూషణం, సిఐ కె.శ్రీనివాసులు, ఎస్ఐ గోపాలుడు, ఎసిటిఒ రమేష్‌రెడ్డి, తూనికలు కొలతల శాఖ అధికారి శివశంకర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇఇ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిదేనా ఛైర్మన్ పీఠం..!

◆ 'దుర్గం'లో తారుమారైన వైసీపీ అంచనాలు

◆ టిడిపిలోకి వైస్‌ఛైర్మన్ జయంఫణి

◆ 11న ఎన్నిక

కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక దగ్గరపడేకొద్ది పట్టణంలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఛైర్మన్ పీఠం కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నిక దగ్గరపడుతున్న సమయంలో వైసీపీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జయంఫణి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో మంగళవారం నాడు టిడిపిలో చేరారు. ఈయన చేరికతో వైసీపీ అంచనాలు ఒక్కసారిగా తలకిందులయ్యాయి. వైస్ ఛైర్మన్ వైసిపికి షాక్ ఇవ్వడంతో కళ్యాణదుర్గం ఛైర్మన్ పీఠాన్ని టిడిపి కైవసం చేసుకోవడం లాంఛనంగానే కన్పిస్తోంది.

కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం ఛైర్మన్ ఎన్నికను ఈ నెల 11వ తేదీన నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నిక నేపథ్యంలో ఇప్పటికే వైసీపీ వారి కౌన్సిల్ సభ్యులను క్యాంపునకు తరలిచింది. టీడీపీ సైతం వారి కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. రెండు పార్టీలు క్యాంపు రాజకీయాలు చేస్తున్నా కొందరు కౌన్సిలర్లు వెళ్లలేదు. ఇదిలా ఉండగా వైసీపీ క్యాంపు శిబిరంలో ఉన్న వారిలో ఎందరు ఆ పార్టీకి మద్దతుగా ఓటేస్తారన్న దానిపై ఆ పార్టీలోనే సందేహాలు నెలకొన్నాయి. వైస్ ఛైర్మన్ జయంఫణి టీడీపీలో చేరడంతో మిగిలిన వైసీపీ సభ్యులు మరికొందరు సైతం ఆ పార్టీకి హ్యాండ్ ఇస్తారనే ప్రచారం నడుస్తోంది. ఛైర్మన్ పీఠంపై మంగళవారం సాయంత్రం వరకు ధీమాగా ఉన్న వైసీపీ శిబిరంలో వైస్ ఛైర్మన్ పార్టీ మార్పుతో కలవరం మొదలైంది.

2021లో జరిగిన కళ్యాణదుర్గం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరపున నలుగురు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు, 19 మంది వైసీపీ తరపున కౌన్సిలర్లుగా గెలుపొందారు. దీంతో అప్పట్లో ఛైర్మన్ పీఠాన్ని వైసిపి కైవసం చేసుకుంది. నాటకీయక పరిణామల మధ్య వైసీపీ అధిష్టానం ఛైర్మన్‌ను పదవి నుంచి తప్పించింది. అప్పటి నుంచి ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా తిమ్మప్ప కొనసాగుతున్నారు. ఎన్నికల సంఘం ఛైర్మన్ ఎన్నిక నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంతో వైసిపి, టిడిపిలు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. తమ సీటును కాపాడుకోవాలని వైసిపి, అధికార పార్టీ కావడంతో ఛైర్మన్ గిరిని సొంతం చేసుకోవాలని టిడిపి ప్రయత్నాలు చేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నిక ముందు, కూటమి అధికారంలోకి వచ్చాక ఆరుగురు కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. ఇక స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన గౌతమి బీజేపీలో చేరారు. ప్రస్తుతం కౌన్సిల్‌లో కూటమి బలం 11కు చేరుకుంది. ఎంపి, ఎమ్మెల్యేలు ఓటుతో కలుపుకుంటే కూటమి బలం 13కు చేరుతుంది. ఇదే సమయంలో వైసీపీకి 13 మంది సభ్యుల బలం ఉంది. ఎన్నికల అనంతరం టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ గంగమ్మ మళ్లీ రంగయ్య వద్దకు చేరుకోవడంతో ఆ పార్టీ బలం మరింత పెరిగింది. ఇదే సమయంలో సస్పెన్షన్‌లో ఉన్న వైసీపీ వైస్ ఛైర్మన్ జయంఫణి టిడిపిలోకి వెళ్లడంతో వైసిపికి కొత్తచిక్కులు వచ్చాయి. పార్టీ ఫిరాయింపుల వ్యవహారం జయంఫణితోనే ఆగిపోతుందా... క్యాంపులో ఉన్న మరికొందరు కౌన్సిలర్లు టిడిపిలోకి వెళ్తారా అన్న సందేహాలు వైసిపి నాయకులను వెంటాడు తున్నాయి. ఏదిఏమైనా ఛైర్మన్ పదవిని కూటమి దక్కించు కోవడానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్ని అవకాశాలనూ వాడుకుంటున్నట్లు స్పష్టమవుతుంది.

మిరప రైతులను ఆదుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తెగుళ్ల వల్ల నష్టపోయిన మిరప రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బిహెచ్.రాయుడు, చంద్రశేఖర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. జిల్లాలో ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో రైతులు అప్పులు చేసి మిరప పంటను సాగు చేశారని తెలిపారు. ఈ సంవత్సరం వివిధ రకాల తెగుళ్ల ఎండు తెగుళ్ళ, వైరస్, నల్లతామర పురుగు వల్ల వందలాది ఎకరాల్లో పంట ఎండిపోయిందన్నారు. రైతులు పంటను కాపాడుకునేందుకు ఎన్ని రకాల మందులు పిచికారీ చేసినా ప్రయోజనం దక్కలేదన్నారు. చేసేది లేక రైతులు పంటను తొలగించేస్తున్నారని చెప్పారు. పరిస్థితి ఇంతలా ఉన్నా రైతుల దగ్గరికి ఏ ఒక్క అధికారి కూడా వెళ్లి పరిస్థితి తెలుసుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రభుత్వం స్పందించి ఎండు తెగుళ్లతో పంట నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలన్నారు. ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలన్నారు. శాస్త్రవేత్తలను పిలిపించి క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. పంట కాపాడుకునేందుకు ప్రభుత్వమే రైతు సేవకేంద్రాల ద్వారా మందులు సరఫరా చేయాలన్నారు. రైతుల దగ్గర ఉన్న పంటను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) బుధవారం నుంచి ప్రారంభం అవుతాయని డీఈవో ప్రసాద్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా పరీక్షలు జరుగాయన్నారు. జిల్లా కేంద్రంలో 5, తాడిపత్రి, గుత్తిలో ఒక్కోక్క పరీక్ష కేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. అభ్యర్థులు హాల్ టికెట్, గుర్తింపు కార్డుతో ఒక గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

అఖండ కోసం పూజలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 తాండవం సినిమా ఎలాంటి అవాంతరాలు లేకుండా విడుదలై ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ బాలకృష్ణ అభిమానులు అనంతపురం కోర్టు రోడ్డు వద్ద ఉన్న హనుమాన్ దేవాలయం వద్ద 101 టెంకాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలతో నందమూరి బాలకష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.గౌస్‌మొద్దీన్, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

ఊడిపడిన పాఠశాల పైకప్ప పెచ్చులు

విద్యార్థులకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-గుత్తి

బల్లలపై పడిన పెచ్చులు

మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో ఉన్న నంబర్-2 ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తుటిలో పెను ప్రమాదం తప్పింది. నాలుగవ తరగతి గది పైకప్పు పెచ్చులూడి కిందపడ్డాయి. అయితే ఇదే తరగతిలో విద్యనభ్యసిస్తున్న 17 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి పాఠశాల ఆవరణలోకి వెళ్లడంతో ప్రాణాపాయం తప్పినట్టయింది. భోజనానికి వెళ్లకపోయి ఉంటే పెను ప్రమాదం జరిగేదని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదాల సర్కిల్..!

తాడిపత్రిలోని కడప రోడ్డులో తరచూ ఘటనలు

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి అంబేద్కర్ సర్కిల్ కూడలిలో ఇటీవల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఘటన జరిగినప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు హడావుడి చేయడం తర్వాత వదిలేయడం పరిపాటిగా మారింది. ఇక్కడ ప్రమాదాలు జరగకుండా శాశ్వత నివారణ చర్యలు తీసుకోవడంలో పోలీసులు, సంబంధిత అధికారులు విఫలం అయ్యారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అంబేద్కర్ కూడలిలో కడపకు వెళ్లే రోడ్డుపై రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇదే రోడ్డుకు ఇరువైపులా లాడ్జి, హోటళ్ళు, దుకాణాలు, మద్యం షాపులు ఉన్నాయి. వీటికి తోడు రోడ్డుపై అడ్డంగా పలు వాహనాలను ఆపి ఉంటారు. జాతీయ రహదారికి అనుసంధానమై ఉండడంతో భారీ వాహనాలతో పాటు ట్రక్కులు ఈ రోడ్డుపై నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలు ఇరుకైన రోడ్లు వెళ్తున్న సమయంలో కాస్త వాహనదారులు ఏమరపాటుకు గురైనా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వాటిని తొలగించడంపై అధికారులు మీనమేషాలు వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంబేద్కర్ సర్కిల్, కడప రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

లారీ కింద పడి వ్యక్తి మృతి

తాడిపత్రి పట్టణం కడప రోడ్డు ఐశ్వర్య విల్లాస్‌లో నివాసముంటున్న రామ్మోహన్ రెడ్డి అంబేద్కర్ సర్కిల్‌లో జరిగిన ప్రమాదంలో మరణించాడు. ద్విచక్రవాహనంలో వెళ్తుండగా భారీ లారీ ఆయన వాహనానికి తగిలింది. కింద పడిన అతనిపై లారీ వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మరణించాడు. ఈ ప్రాంతంలో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటూ ఉండడంతో వాహనదారులను భయాందోళనకు గురి చేస్తోంది.

హామీలను అమలు చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-తాడిపత్రి

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 2023లో 42 రోజులపాటు చేపట్టిన చారిత్రాత్మక సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శంకరమ్మ, కోశాధికారి భాగ్య డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని తాడిపత్రి ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఉమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, హెల్పర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని, 5జి స్మార్ట్‌ఫోన్లు ఇవ్వాలని, వివిధ రకాల యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 12వతేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉమాగౌడ్, నరసింహా రెడ్డి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ గౌరవా ధ్యక్షులు రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి

వృకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

కూలీలతో మాట్లాడుతున్న వృకాసం నాయకులు

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండలంలోని కిష్టిపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజులు పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలకు అదనంగా మరో వంద రోజులు పనులు కల్పించాలన్నారు. క్యూబిక్ మీటర్ రేటును రూ.400కు పెంచి రోజు కూలి రూ.600, 200 రోజులు పనులు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు వారాల బిల్లులను చెల్లించాలన్నారు. కూలీలకు ప్లే స్లిప్పులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణనారాయణ, రంగస్వామి, సూరి, రంగమ్మ, శిరీషా, లక్ష్మీదేవి, లక్ష్మి, ఓబుళమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల మధ్య గొడవ..ఒకరి హత్య

స్నేహితుల మధ్య మొదలైన ఘర్షణ ఒకరి హత్యకు దారి తీసింది. స్నానం కోసం వెళ్లిన వారు ఘర్షణ పడి దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో సాయికుమార్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు.

వివరాలు మెయిన్‌లో..

సాయికుమార్ (ఫైల్‌ఫొటో)

విద్యుత్, విత్తన బిల్లు ప్రతులు దహనం

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

విద్యుత్, విత్తన బిల్లు ప్రతును దహనం చేస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్, విత్తన బిల్లులను వెంటనే ఉపసంహరించుకోవాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆయా బిల్లుల ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ బిల్లు ప్రకారం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రయివేటుపరం అవుతాయన్నారు. దీనివల్ల వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఉండదన్నారు. దళితులు, గిరిజనులు, వివిధ సామాజిక తరగతులు, పేదలు బలహీన వర్గాలకు ఇచ్చే విద్యుత్ రాయితీ, చిన్న చిన్న పరిశ్రమలకు ఇచ్చే విద్యుత్తు రాయితీ ఉండదన్నారు. దీంతోపాటు విత్తన బిల్లు ప్రయివేట్, కార్పొరేట్ విత్తన కంపెనీల ప్రయోజనాల కోసం తెచ్చిందన్నారు. కావున వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆయా బిల్లులను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఓబులేసు, హనుమంతురెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, సూర్యనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు కొలతలు

ప్రజాశక్తి-కుందుర్పి

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు రహదారి విస్తరణకు మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా అధికారులు మంగళవారం కొలతలు వేశారు. ఇందులో భాగంగా ఆర్అండ్‌బి అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ దాదాపు 60 అడుగుల మేర కొలతలు వేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇంటి యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ కన్వీనర్ రంగనాథ్, ఆయకట్టు ఛైర్మన్ రామ్మూర్తి నాయుడు, మాజీ సర్పంచు పెద్ద నరసింహప్ప, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ బసప్ప, గొల్లపల్లి ప్రసాద్, సర్పంచు మారుతీశ్వర రామమూర్తి, ఎంపిడిఒ లక్ష్మీశంకర్, ఇఒఆర్‌డి రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు హరీష్, యల్లక్క, రఘు, మండల కోఆర్డినేటర్ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి యజమానుల అభ్యంతరం

కొలతలకు వస్తున్న ఆర్అండ్‌బి అధికారులు

జెఎన్‌టియు విసిని కలిసిన అనంత రామశర్మ

అనంతపురం : ఉమ్మడి జెఎన్‌టియులో పని చేసిన లంక అనంత రామశర్మ మంగళవారం వైస్ ఛాన్సలర్ సుదర్శనరావును మర్యాద పూర్వకంగా కలిశారు. కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం విచ్చేసిన ఆయన ఉపకులపతిగా బాధ్యతలను చేపట్టారని తెలుసుకుని సుదర్శనరావును కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసి పని చేసిన విషయాలను గుర్తు చేసుకున్నారు. ఈయనతోపాటు సుజాత, దుర్గాప్రసాద్, సుజాత, శోభాబిందు, మాజీ ఆచార్య శంకర్, శర్మ భార్య, పెద్దకూతురు, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు విసితో అనంత రామశర్మ కుటుంబ సభ్యులు

పోస్టర్లను విడుదల చేస్తున్న అతిథులు

12 నుంచి రాష్ట్రస్థాయి యోగా పోటీలు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురంలో ఈనెల 12, 13, 14వ తేదీల్లో స్థానిక పివికెకె కళాశాల క్యాంపస్‌లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ముఖ్య పోషకులు కెవి.రమణ, గౌరవాధ్యక్షులు జి.ముత్యాలరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి బాలబాలికలు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఇఎన్ మారుతీప్రసాద్, దీవాకర్, వై.ఆంజనేయులు, మహేష్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్

మహిళ మృతి.. రెండు కొట్టాలు దగ్ధం

ప్రజాశక్తి-బెలుగుప్ప

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు కొట్టాలు దగ్ధం కావడంతోపాటు మహిళ మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి మండల పరిధిలోని గంగవరం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శివ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో నరసన్న తోటలో రెండు కుటుంబాలు కొట్టాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాయి. ఈనేపథ్యంలో ఓ కొట్టంలో గంగమ్మ (55) నిద్రిస్తుండగా ఒక్కసారిగా కొట్టానికి మంటలు వ్యాపించాయి. అయితే నిద్రలో నుంచి లేచి బయటకు పరుగులు తీస్తుండగా గంగమ్మకు మంటలు వ్యాపించాయి. దీంతో ఆమె బయటకు రాలేక మంటల్లో చిక్కుకుని మృతచెందింది. మృతురాలి కొడుకు ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దగ్ధమైన కొట్టం (ఇన్‌సెట్‌లో) మృతచెందిన గంగమ్మ (పాతచిత్రం)

టిడిపిలో చేరిన వైస్‌చైర్మన్ జయం ఫణి

ఎమ్మెల్యే సురేంద్రబాబుతో వైస్‌చైర్మన్ జయం ఫణి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

వైసిపీకి చెందిన కళ్యాణదుర్గం మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి టీడీపీలో చేరారు. ఈమేరకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో మంగళవారం టిడిపి కండువా కప్పుకున్నారు. వైసిపిలో సస్పెన్షనకు గురైన జయం ఫణిపై త్వరలో జరగనున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికను దృష్టిలో ఉంచుకుని వైసిపి అధిష్టానం సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. ఈనేపథ్యంలో జయం ఫణి వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేసి ఆ పార్టీ సమన్వయకర్తకు రాజీనామ లేక పంపారు. ఈ సందర్భంగా ఫణి మాట్లాడుతూ వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య కారణంగానే తాను వైసిపిని వీడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు ఎలాంటి కక్షసాధింపు రాజకీయాలు చేయకుండా అభివృద్ధి చేస్తున్నారన్నారు. అభివబుద్ధిలో తాను కూడా భాగస్వామి కావాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ తలారి రంగయ్య బోయ ఆనంద్ మరణం విషయంలో నీచరాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. బోయ ఆనంద్‌ను ఆగ్రమర్ణాల వారు హత్య చేశారని చెప్పిన అబద్ధాలు చెప్పడంతో పోలీసులు నోటీసులు జారీ చేస్తే తప్పించుకుని తిరుగున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్, కౌన్సిలర్లు వెంకటేశులు, తిమ్మప్ప, మహాలక్ష్మి, రాధికరాణి తదితరులు ఉన్నారు.

న్యాయం చేసి.. రక్షణ కల్పించండి

తహశీల్దార్‌కు మహిళా రైతు వినతి

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితురాలు, పక్కన జెడ్పీటీసీ బోగతి ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-యల్లనూరు

భర్త నుంచి సంక్రమించిన వ్యవసాయ భూమి సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతోపాటు బంధువులన ఉంచి రక్షణ కల్పించాలని మండల పరిధిలోని వెన్నపూసపల్లి గ్రామనికి చెందిన మహిళా రైతు కృష్ణకుమారి కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలో తహశీల్దార్‌తోపాటు జడ్పిటిసి బోగాతి ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ తన భర్త బి.నాగేశ్వరరెడ్డి నుంచి వచ్చిన ఆస్తిని భర్త తమ్ముడు బి.ప్రసాద్‌రెడ్డి ఆక్రమించుకొన్నాడని వాపోయింది. అంతేగాకుండా తనను ఇంటి నుంచి దౌర్జన్యంగా బయటకు నెట్టేసి కూల్చాడని.. గ్రామంలో ఉంటే తనను కూడా చంపుతామని బెదిరిస్తున్నాడని తెలిపింది. ఇల్లు కూల్చినప్పుడు ఎస్పీ జగదీష్‌ను కలిసి తన గోడును వెల్లబోసుకున్నానన్నారు. దీంతో అప్పటి డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణకు రాగా ఆస్తి తనదే అని స్థానికులు చెప్పినా ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తనకు న్యాయం చేయాలని కోరింది.

మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు సహకరించాలి

ప్రిసైడింగ్ ఆఫీసర్ వసంతబాబు

మాట్లాడుతున్న ప్రిసైడింగ్ అధికారి వసంతబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆర్‌డిఒ, ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్ వసంతబాబు సూచించారు. మంగళవారం స్థానిక కౌన్సిల్ హాల్‌లో డీఎస్పీ రవిబాబు, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులందరూ ఉదయం 11 గంటలకు కార్యాలయం పైనున్న కౌన్సిల్ హాల్‌లో హాజరు కావాలన్నారు. 24 మంది కౌన్సిల్ సభ్యులు ఎక్స్ ఆఫ్షియా సభ్యులుగా ఎమ్మెల్యే, ఎంపీ మొత్తం 26 మంది ఓటు హక్కు వినియోగించుకోవడానికి హాజరు అవుతారన్నారు. సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక ఉంటుందన్నారు. అలాగే కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేకరు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

రాయదుర్గం : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా హామీల అమలుకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా రైతాంగాన్ని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం పరిధిలో 60వేల మందితో సంతకాలు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో వైసిపి పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామాంజనేయులు, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పొరాళు శివ, జిల్లా విభాగం అధ్యక్షులు చుంచుల నాగప్ప, మున్సిపల్ వార్డు సభ్యుడు గోవిందరాజులు, బషీర్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఓబులేసు

పామిడి : వాల్మీకి సంఘం గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షులుగా మండలంలోని జి.కొట్టాల గ్రామానికి చెందిన తూర్పుంటి ఓబులేసు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు ఆదేశాలను పాటిస్తానన్నారు. ముఖ్యంగా సంఘం బలోపేతంతోపాటు వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ, విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభ్యున్నతికి శ్రమిస్తానన్నారు.

21న ఉచిత కంటి వైద్యశిబిరం

పామిడి : స్థానిక భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో ఈనెల 21వ తేదీన ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, క్లబ్ అధ్యక్షులు రఘువీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుకాణాల కేటాయింపులో అవకాశం ఇవ్వండి

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని టవర్ క్లాక్ ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ దుకాణాల కేటాయింపులో వికలాంగులకు అవకాశం ఇవ్వాలని ఐ టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి శివా నంద కోరారు. ఈమేరకు నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బాలస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల కేటాయింపులో వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలని కోరారు. అలాగే రాంనగర్ ఫ్లైఓవర్ కింద కూడా ఇదే విధానాన్ని కొనసాగించాలని కోరారు.

కవి ఓబిరెడ్డికి నివాళి

అనంతపురం : ప్రముఖ రచయిత, కవి ఓబిరెడ్డి మృతికి పలువురు నివాళులర్పించారు. ఈయన తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆవిర్భావం నుంచి ప్రధాన కార్యదర్శిగా సాహిత్య సేవలు అందించారు. ఆయన మృతికి సంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి నివాళులర్పించారు. కాగా రేపు ఉదయం స్థానిక శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో ఓబిరెడ్డి సంతాప సభతో పాటు, ప్రముఖ రచయిత, హేతువాది, సాహితీవేత్త, పండితుడు కట్టమంచి రామలింగారెడ్డి జయంతి నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఆపరేటర్‌పై దాడి

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని చుక్కలూరు సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్న నాగేంద్రపై గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి దాడి చేసిన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. సుమారు ఐదారుగురు గుర్తు తెలియని వ్యక్తులు సబ్‌స్టేషన్‌లోకి చొరబడి కట్టెలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచినట్లు బాధితుడు తెలిపారు. తర్వాత స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

మీడియా పేరుతో బెదిరింపు తగదు

టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెఎల్ మురళి

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెఎల్ మురళి

ప్రజాశక్తి-అనంతపురం

మీడియా పేరుతో పలువురు యూట్యూబర్లు, చిన్న పత్రికల యాజమాన్యాలు వక్రమార్గంలో ప్రజలను లూటీ చేయడం తగదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి అన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ బ్యాంకు సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిజం కొందరి వల్ల పక్కదారి పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారమే లక్ష్యంగా అక్రమ మార్గంలో దోపిడీకి దిగబడుతున్నారన్నారు. ముఖ్యంగా వాస్తవాలు తెలుసుకోకుండా తనపై తప్పుడు కథనాలను చిత్రీకరించారన్నారు. సోమనాథ్ నగర్‌లో భూమిని ఆక్రమించారని తప్పుడు ఆరోపణలతో కథనాలు రాసి బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపించారు. ఇలాంటి వారిపై కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో బియ్యం వ్యాపారి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్ష కేంద్రాన్ని మార్చొద్దు

ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

ఆందోళన చేస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని కింది భాగంలో ఉన్న రక్త పరీక్షల కేంద్రాన్ని ఆసుపత్రి పైభాగంలోకి మార్చొద్దని ఐద్వా మహిళా సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ అధ్యక్షురాలు బి.జ్యోతి, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకీ మాట్లాడుతూ గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి రోజుకూ వందలాది మంది ప్రజలు వచ్చి రక్తపరీక్షలు చేయించుకుంటారన్నారు. వీరిలో ఎక్కువగా గర్భిణులు, వృద్ధులు, వికలాంగులు, రోగులు వస్తారన్నారు. ఇలాంటి సమయంలో రక్త పరీక్ష కేంద్రాన్ని మార్చడం వల్ల వారందరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. అలాగే రక్త పరీక్షల కేంద్రంలో టెక్నీషియన్ల కొరత తీర్చాలన్నారు. కావున రక్త పరీక్ష కేంద్రాన్ని ఆసుపత్రి కింద భాగంలోనే ఏర్పాటు చేయాలని, టెక్నీషియన్ల కొరత తీర్చాలని, సెక్యూరిటీ గార్డును కూడా నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం నాయకురాలు సాయి ప్రేమ, సరస్వతి, గంగరత్న, తులసి, గాయత్రి, సుంకమ్మ, అంజనమ్మ, మున్నీ, రహమ్మత్‌బీ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు జాక్,సమీర్, సాయి, పవన్, షేక్షా, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

బాలికల వసతి గృహాల సందర్శన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

పట్టణంలోని దొడగట్ట రోడ్డులో గల సాఫీకసంక్షేమశాఖ బాలికల వసతీ గృహాలు-1,2ను మంగళవారం రాత్రి ఆర్డీఓ వసంతబాబు సందర్శించారు. ఇందులో భాగంగా వసతి గృహాల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, సమస్యలు ఏమైన ఉన్నాయా.. అని విద్యార్థినులకు అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న తల్లిదండ్రులతో కూడా సౌకర్యాలు, భోజన వసతులపై ఆరాతీశారు. నాణ్యమైన భోజనం అందిస్తున్నారానని విద్యార్థినులను అడిగారు. అనంతరం వంటశాలలను పరిశీలించారు. కుళ్లిన కాయగూరలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పని చేస్తున్న వార్డెన్ ఒక చోట సోషియల్‌వెల్ఫర్, మరోచోట బీసీ వెల్ఫర్ ఉద్యోగాలు చేస్తూ అందుబాటులో ఉండడంలేదని గుర్తించారు. ఈకారణంగా విద్యార్థినులకు నాణ్యమైన భోజనం ఇతర సౌకర్యాలు ఎలా సాధ్యమవుతుందని నిలదీశారు. ఏఎస్‌డబ్యూఓ ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ ఆంజినేయులు, సబ్‌డివిజినల్ విజిలెన్స్ కమిటీ సభ్యులు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెర్ల, సోమలదొడ్డిలో 'పొలం పిలుస్తోంది'

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల, సోములదొడ్డి గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సస్యరక్షణపై అవగాహన కల్పించారు. తర్వాత పంటల సాగు, ఎరువుల వాడకంపై సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.వెంకట్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు మల్లికార్జున, బ్యాళ్ల మురళీకృష్ణ, రైతు సేవా కేంద్ర సిబ్బంది గంపరాజు, భాగ్యలక్ష్మి, డీలర్ మునిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో వైసిపి నాయకుల పర్యటన

యల్లనూరు : మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలో వైసిపి నాయకులు మంగళవారం పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా డ్రెయినేజీ, తాగునీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణం, తదితర అంశాలపై కాలనీ ప్రజలతో చర్చించి త్వరలో పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దొడ్లో కిరణ్ కుమార్, అనుపురి సుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లపై చర్యకు వినతి

యల్లనూరు : మండలంలోని ఇసుక రీచ్‌లపై చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగతి ప్రతాప్‌రెడ్డి కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ రాముకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక టిప్పర్ల ఎక్కువగా తిరుగుతుండటంతో ఆర్‌అండ్‌బి రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. అంతేగాకుండా ప్రజా రవాణాకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కావున ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడాకారులకు సత్కారం

క్రీడాకారులను సన్మానిస్తున్న నారాయణస్వామి

గుంతకల్లు : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మొదటి స్థానాలు సాధించి దేశస్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సోదరుడు, గుంతకల్లు మండల టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న పరుగు పందెం పోటీల్లో జిల్లా నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికైతే అందులో నియోజకవర్గం నుంచి 8 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల కోచ్ కౌన్సిలర్ రంగన్న, 28వ వార్డు ఇన్‌ఛార్జి శివశంకర్, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ కనకవీటి రామప్ప, తదితరులు పాల్గొన్నారు.

సజ్జలదిన్నెలో ఎమ్మెల్యే పర్యటన

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామంలో పునరుద్ధరించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ సమస్యలను పరిశీలించారు.

కోదండ రామాలయం అభివృద్ధికి కృషి

చైర్మన్ అమిలినేని నరేంద్రచౌదరి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని మొదటి రోడ్డులో ఉన్న కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయం అభివృద్ధికి గతంలో కనీవిని ఎరుగని రీతిలో శ్రీకారం చుట్టామని ఆలయ ఛైర్మన్ అమిలినేని నరేంద్రచౌదరి అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ చొరవతో ఆలయ అభివృద్ధికి రూ.4.5కోట్లతో అంచనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందులో రూ.3.60 కోట్లు ఎండోమెంట్ నుంచి రూ.90 లక్షలు దాతల నుంచి సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు దాతలు నుంచి సుమారు రూ.7లక్షలు వచ్చిందన్నారు. రూ.90 లక్షలు దాతల నుంచి సేకరి ంచిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ నుంచి రూ.3.60 కోట్ల నిధులను విడుదల చేయనున్నట్లు వివరించారు. అతిత్వరలో రూ.4.50 కోట్లతో ఆలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. గొప్ప చరిత్ర కలిగిన ఆలయాన్ని కనీవిని ఎరగని రీతిలో అద్భుతమైన గోపురాలు, గుడి ప్రాంగణంలో నూతన శోభతో కళ్యాణ మంటపం నిర్మాణంతోపాటు పలు నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు. 103 ఏళ్ల సుదీర్ఘమైన పురాతన చరిత్ర కలిగిన ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన బుధవారం సర్వసభ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

కాలువలో పూడికతీత

రాప్తాడు : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు మండలంలోని గంగులకుంట చెరువును నీటితో నింపడానికి కాలువల్లో మంగళవారం పూడికతీత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కురబ సంఘం రాష్ట్ర సాధికార కమిటీ కన్వీనర్ బులగొండ రమణ, మార్కెట్ యార్డు వైస్‌ఛైర్మన్ కిష్ట, మండల కన్వీనర్ పంపు కొండప్ప, సర్పంచు తిరుపాలు, సొసైటీ ఛైర్మన్ మరూరు గోపాల్, జూటూరు రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ శివ, తదితరులు పాల్గొన్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

గుత్తి : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 12వతేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిపి గాండ్లపాటి విశాలాక్షి, ఎంపిడిఒ డి.ప్రభాకర్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని సర్పంచ్, ఎంపీటీసీ, మండల కో-ఆప్షన్, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బొమ్మనహాల్ : ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నవీన్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని పోలీస్‌స్టేషన్లో కండిషన్ బెల్‌పై ఉన్న వ్యక్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి తెలిసో.. తెలియకో నేరం చేసి కేసులు నమోదు చేసి ఉంటారని..రెండోసారి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంల్లో సోదరభావంతో మెలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

అనంతపురం సిటీ : దళితులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత, గిరిజన సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి డిమాండ్ చేశారు. మంగళవారం నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సాగర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ నెలరోజుల క్రితం దళిత సూర్యనారాయణపై మండల కేంద్రంలో పట్టపగలు 70 మంది కిరాతకంగా దాడి చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో దళిత, గిరిజన సంఘాల నాయకులు గడ్డంనాగేపల్లి హనుమంతు, గంగయ్య, కుళ్లాయప్ప, శ్రీరాములు, రాము, రమణ, మల్లికార్జున, రాజగోపాల్, చెన్నంపల్లి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్‌లో వృద్ధుడు మృతి

గుత్తి : మండలంలోని బేతాపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లాంట్‌లో ఓ వృద్ధుడు మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలి మేరకు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రబీవుల్లా (62) సోలార్ ప్లాంట్‌లో వాచ్‌మెన్ పని చేస్తున్నారు. సోమవారం రాత్రి యథావిధిగా పడుకుని ఉదయం ఎంత సేపటికీ నిద్ర లేవకపోవడంతో అక్కడ గదిలో ఉండేవారు అనుమానంతో లేపి చూశారు. అయన లేవకపోవడంతో వెంటనే అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వరిధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

రైతుల పండించిన వరిధాన్యాన్ని గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని తరిమెల, నిదనవాడ, రాచేపల్లి గ్రామాల్లో రైతులు పండించిన వరిధానాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో చాలామంది రైతులు దళారులను నమ్మి మోసపోతున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వరిపంటకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు సుంకన్న, ఎర్రిస్వామి, మునెప్ప, కొండారెడ్డి, కేశన్న, వెంకట్ రాముడు, తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, అరకటివేముల, మడుగుపల్లి గ్రామాల్లో మంగళవారం శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సత్యబాబు, ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ మహిళలు శక్తియాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. అలాగే మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు, డయల్ 100, 112, 1098, 181 నెంబర్లపై అవగాహన కల్పించారు. తర్వాత గుడ్డు టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.

రచయిత జాన్ మిల్టన్‌కు నివాళి

నార్పల : రచయిత జాన్ మిల్టన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కావేరి ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గొప్ప ఆంగ్ల కవి, రాజకీయ విశ్లేషకుడు, ప్రభుత్వ అధికారి అయిన మిల్టన్ రచనలు, కవిత్వ శైలి ఆంగ్ల సాహిత్యంపై చెరగని ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

నార్పల : మండలంలోని బొందలవాడ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వెంకట్ వకుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకట్ వకుల ఫౌండేషన్ ఛైర్మన్ ఆలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. భవనం బాగుండాలంటే పునాది భద్రంగా ఉండాలని.. అదేవిధంగా భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవడానికి ప్రాథమిక దశలో చదువు బాగుండాలన్నారు. భవిష్యత్తులో మీరందరూ ఉన్నత విద్యను అభ్యసించి మన బొందలవాడ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బీ.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బి.ఫార్మసీ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివకుమార్, అడిషినల్ కంట్రోలర్లు జి.శంకర్ శేఖర్‌రాజు, శ్రీధర్, ఎం.అంకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ www.jntuaresults.inను సంప్రదించాలని కోరారు.

బిల్లుల మంజూరుపై ఫిర్యాదు

అనంతపురం కార్పొరేషన్ : అక్రమంగా బిల్లులు చేసుకున్న ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక నవోదయ కాలనీకి చెందిన ఎరుకల వీరాంజనేయులు కోరారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం పందుల పెంపకదారుల కోసం ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలో రెండున్నర ఎకరాల స్థలం కేటాయించి నివాసి స్థలాలు ఇవ్వాలని ఆదేశాలిస్తే ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా రూ.10లక్షల బిల్లులు చేసుకుని తిన్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

పుస్తకాలు, కుర్చీలు అందజేత

యాడికి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌యాదవ్ పదవ తరగతి పిల్లలకు మోడల్ పేపర్స్ పుస్తకాలు, 20 కుర్చీలను వితరణ చేశారు. ఈమేరకు హెచ్ఎం సీతారామాంజనేయులుతో కలిసి విద్యార్థులకు అందజేశారు.

బాస్కెట్‌బాల్ టోర్నీలో పివికెకె విద్యార్థి ప్రతిభ

అనంతపురం : పివికెకె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు బాస్కెట్ బాల్ టోర్నీలో ప్రతిభ కనబరిచారు. ఎంసిఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న కెఎం.ఉమర్ దక్షిణ భారత స్థాయిలో నిర్వహించిన సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్, సెలక్షన్స్‌లో అద్భుతమైన ప్రదర్శనతో అందరి ప్రశంసలు అందుకోవడంతోపాటు దక్షిణ మండల జట్టుకు ఎంపికయ్యాడు. దీంతో విద్యార్థిని కళాశాల ఛైర్మన్ కిషోర్ పల్లె, ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, ఎఒ మనోహర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ధనుంజయ, అధ్యాపకులు ఉమర్, తదితరులు అభినందించారు.

ఫర్టిలైజర్స్ దుకాణదారులు బాధ్యతగా వ్యవహరించాలి

నార్పల : రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించడంలో ఫర్టిలైజర్స్ దుకాణదారులు బాధ్యతగా వ్యవహరించాలని తాడిపత్రి విభాగం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రవి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్‌లు, రేట్లు, లైసెన్సులు, బిల్లుల జారీ, నమూనాల సంరక్షణ వంటి అంశాల్లో ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి సి.చన్నవీరస్వామి, దుకాణదారులు పాల్గొన్నారు.

కుక్కలకు కుని శస్త్ర చికిత్సలు

రాయదుర్గం : పురపాలక సంఘం పరిధిలోని వీధికుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేయించినట్లు మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో 837 వీధి కుక్కలు ఉండగా మొదటి విడత మంగళవారం 36 కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించి వీధుల్లో వదిలినట్లు తెలిపారు.

13న లోక్ అదాలత్

రాయదుర్గం : పట్టనంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాయదుర్గం పోలీస్ ఇన్స్‌పెక్టర్ జయనాయక్ తెలిపారు. దీర్ఘకాలంగా కేసులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు లోక్ అదాలత్‌కు వచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

పాఠశాల తనిఖీ

కుందుర్పి : మండల పరిధిలోని బండిమీదపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంఇఒ తిప్పేస్వామి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరు బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. తర్వాత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

పోలీసుల తనిఖీలు

కళ్యాణదుర్గం టౌన్ : ఎస్పీ అదేశాల మేరకు కళ్యాణదుర్గం పోలీసులు రెండు రోజులుగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో సిఐ హరినాథ్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేప్టారు. ఇందులో రికార్డులు సరిగాలేని 90 ద్విచక్ర వాహనాలు, 22 ఆటోలు , 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ధర్నాకు తరలిరండి

కళ్యాణదుర్గం టౌన్ : వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 12న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు తరలిరావాలని అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కోశాధికారి రాధ, కార్యదర్శి తిప్పిరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తొమ్మిది డిమాండ్ల పరిష్కారం కోసం ధర్నా చేస్తున్నామన్నారు.

మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సూసైడ్ ప్రివెన్షన్ ఇండియా ఫౌండేషన్, డిఎంఇ, ఎపి, అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ సహకారంతో మంగళవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయశ్రీ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.షారోన్ సోనియా, బెంగళూరుకు చెందిన ఎస్‌పిఐఎఫ్ ఫౌండర్ డాక్టర్ నెల్సన్ వినోద్ మోసెస్, సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ శారద, వైద్యులు వరదరాజులు, రవికుమార్, హవీలా, శ్రీధర్, స్వాతి, లలితా భవాని, యల్లమనాయుడు, తదితరులు పాల్గొన్నారు.